నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
11 హైదరాబాద్, సోమవారం 18 మార్చి 2024 RANGAREDDY

# ప్రజావాణి రద్దు

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక వెల్లడి**

రంగారెడ్డి, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని వివరించారు. వాస్తవానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ గత ఫిబ్రవరి 26వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడిందని, తాజాగా లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ప్రజావాణి కార్యక్రమం ఉండదని అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రజావాణి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

# విజయీభవ



## నేటి నుంచి ఏప్రిల్ 2 వరకు టెన్త్ పరీక్షలు

- 5 నిమిషాల వరకు ఆలస్యానికి అనుమతి
- ఉమ్మడి జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- రంగారెడ్డి జిల్లాలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు 50,946 మంది, వికారాబాద్ జిల్లాలో 13,412..

రంగారెడ్డి, మార్చి 17 (నమస్తే తెలంగాణ)/బొంరాస్‌పేట : రంగారెడ్డి, వికా రాబాద్ జిల్లాల్లో నేటి నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు జరుగనున్న పదోతరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని 986 పాఠశాలల నుంచి 50,946 మంది రెగ్యులర్, 1,012 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 239 కేంద్రాలు, ప్రైవేట్ విద్యార్థులకోసం మరో 10 కేంద్రాలను అధికారులు ఏర్పా టు చేశారు. వికారాబాద్ జిల్లాలో 13,412 మంది స్టూడెంట్స్ టెన్త్ ఎగ్జామ్స్ రాయనున్నారు. ఏయిడెడ్ బడుల నుంచి 39మంది, బీసీ గురుకులాల నుంచి 688మంది, ఎస్సీ గురుకులాల నుంచి 534మంది, ఎస్టీ ఆశ్రమ స్కూళ్ల నుంచి 343మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 2848మంది, ఎస్టీ గురుకులాల నుంచి 321మంది, మైనార్టీ గురుకులాల నుంచి 277మంది, టీఆర్ఐఈఎస్ నుంచి 151, మాడల్ స్కూళ్ల నుంచి 810మంది, జడ్పీహెచ్ఎస్‌ల నుంచి 6195 మంది, ప్రభుత్వ పాఠశాలల నుంచి 385, కేజీబీవీల నుంచి 821 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 6913 మంది బాలురు, 6499 మంది బాలికలున్నారు. ఇందుకోసం జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా.. 5నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చినా పరీక్ష రాసేందుకు ప్రభు త్వం అనుమతించింది. పాఠశాలల హెడ్మాస్టర్ల ద్వారా విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఎవరైనా అందని వారుంటే వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షల సందర్భంగా సరిపడా బస్సులను ఆర్టీసీ నడుపనున్నది. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు.

### సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ఉమ్మడి జిల్లాలో పదోతరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రంగారెడ్డి జిల్లాలో ప్రతి పరీక్షా కేంద్రానికీ ఓ చీఫ్ సూపరింటెండెంట్, ఓ డిపార్ట్‌మెంటల్ అధికారిని..అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 2,450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రానికీ ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. 10 రూట్లలో కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను సరఫరా చేయనున్నారు. వికారాబాద్ జిల్లాలో 772 మంది ఇన్విజిలేటర్లు, 164 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మాస్‌కాపీయింగ్ కట్టడికి ప్రతి పరీక్షా కేంద్రంలో ఇతర శాఖలకు చెందిన అధికారులను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు. విద్యార్థులు, పరీక్ష సిబ్బంది ఎవరూ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడం నిషేధం. విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కేలు, జామెట్రీ తదితర పరికరాలను మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉన్నది. పరీక్ష ముగిసే వరకు విద్యార్థులు, సిబ్బంది బయటికి వెళ్లేందుకు అనుమతించరు.

### పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు హాల్ టికెట్లను సరి చూసుకోవాలి. పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. విద్యార్థులు, పరీక్షలు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు, సెల్‌ఫోన్లను కేంద్రాల్లోకి తీసుకెళ్లొద్దు. ఏమైనా సందేహాలుంటే విద్యాశాఖ కార్యాలయంలోని 08416-235245 నంబరులో సంప్రదించాలి.

–నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్

### 144 సెక్షన్ విధింపు..

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు జరిగే సమయంలో సెంటర్లకు సమీపంలో ఉన్న జీరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు. ఏమైనా సందేహాలుంటే విద్యాశాఖ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లోని ఫోన్‌నంబర్ 8019236220 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షల్లో ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పరీక్షల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిబంధనల మేరకు చర్యలు తప్పవని సూచిస్తున్నారు.




బొంరాస్‌పేట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల




షాద్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

# జిల్లాకు 'పాలమూరు' నుంచి సాగునీరు తీసుకొస్తం

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**



విలేకరులతో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

పరిగి, మార్చి 17 : ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి రెండు పథకాల ద్వారా జిల్లాకు సాగునీరు తీసుకొచ్చేందుకు పరిగి ఎమ్మెల్యే, తాను కృషి చేస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఆదివారం పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పీకర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. పరిగి ప్రాంతం, వికారాబాద్ జిల్లా అభివృద్ధికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రభుత్వం ఎక్కడా తొనకకుండా, బెనకకుండా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నదన్నారు. పరిగి ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో పరిగి నియోజకవర్గానికి రూ.4770 కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి వైపు సాగుతున్నామన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలలో 80శాతం నెరవేర్చామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, కడుమూరి ఆనందం, పరశురాంరెడ్డి, ఎ.కృష్ణ, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.



కస్తూర్‌పల్లి గ్రామంలో ఏర్పాటైన తెలంగాణ బార్డర్ చెక్‌పోస్టు

## బార్డర్ చెక్‌పోస్టు ప్రారంభం

కొడంగల్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో తనిఖీలు నిర్వహించేలా ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొడంగల్ నియోజకవర్గంలోని తెలంగాణ సరిహద్దు కస్తూర్‌పల్లి గ్రామం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని.. కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తామన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పలువురు నృత్యకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో విశాఖపట్నం నుంచి విచ్చేసిన 'కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ' గురువులు తాళ్లపాక సందీప్ కుమార్ తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్యరూపకంలో కళాకారులు నర్తించిన తీరు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నది. – కొండాపూర్, మార్చి 17



# కనిపిస్తే కరిచేస్తున్నాయ్

**వీరంగం సృష్టిస్తున్న వీధి కుక్కలు**

- గుంపుగుంపులుగా స్వైరవిహారం
- పిల్లల నుంచి వృద్ధుల వరకు బాధితులే... పిక్కలు లాగేస్తున్నా.. ప్రాణాలు పోతున్న పట్టని బల్దియా..రోజురోజుకూ సమస్య తీవ్రరూపం
- వీధి కుక్కల నియంత్రణలో చేతులెత్తేసిన అధికారులు
- మేయర్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మొన్న అంబర్‌పేట...నిన్న షేక్‌పేట, రాజేంద్రనగర్, నేడు అద్రాస్‌పల్లి.. ఇలా వరుసగా వీధి కుక్కల దాడి సంఘటనలతో చిన్నారుల తల్లిదండ్రులు హడలిపోతున్నారు. పిల్లలు మొదలుకొని మహిళలు, వృద్ధుల వరకు ఇలా వీధి కుక్కలు ఎవరినీ వదలడం లేదు. మనిషి కనిపిస్తే చాలు కరిచి పడేస్తున్నాయి. పగబట్టినట్లే ప్రవరిస్తూ కండలు పీకేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట జనాలు కుక్క కాటుకు బలవుతున్న పరిస్థితి. నారాయణగూడలోని ఐపీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)కు కుక్క కాట్లతో సుమారు 200 మంది బాధితులు క్యూ కడుతున్నారంటే.. కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా..జీహెచ్ఎంసీ వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్) ఆపరేషనే కాకుండా రేబిస్ నివారణ టీకాలను వేయడంలో బల్దియా నిర్లక్ష్యం చేస్తున్నది. ఏబీసీ ఆపరేషన్లు పెంచేందుకు మూడు జోన్లలో జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు విషయంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నది.

### 70 శాతం శునకాలకు ఏబీసీ..


జీహెచ్ఎంసీ పరిధిలో 70 శాతం కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కుక్కలకు శస్త్రచికిత్స జరగాల్సి ఉందన్నారు. ఈ లెక్కలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన హైలెవల్ కమిటీ సమావేశంలోనూ వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సంబంధిత అధికారులు చెప్పలేకపోయారు. దీంతో మేయర్‌తో పాటు అన్ని పార్టీల కార్పొరేటర్లతో ఏర్పాటైన హైలెవల్ కమిటీ సభ్యులు తీవ్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యాన్ని తూర్పారా పట్టారు. అయినా సంబంధిత వెటర్నరీ విభాగంలో చలనం లేదు. దీంతో రోజురోజుకూ వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చుతున్నది. ఒంటరిగా కనిపిస్తే చాలు గుంపులుగా వెంటపడి కరుస్తున్నాయి. వీధుల వెంబడి గుంపులు గుంపులుగా తిరుగుతూ దడ పుట్టిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే ఒక వైపు ఎండవేడి, మరోవైపు చెత్త వ్యర్థాల డంపింగ్ వద్ద నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తినడం వల్ల కుక్కల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. కనిపించిన వారిపై పిచ్చికోపంతో దాడులకు తెగబడుతున్నాయి. సహజంగా ఎండాకాలంలో తాగునీటి వసతి తక్కువగా ఉండటంతో వేడి తీవ్రతతో వీధికుక్కల్లో ప్రకోపనం (ఇరిటేషన్) అధికంగా ఉంటుంది. వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, రేబిస్ వ్యాక్సిన్లు వేశామని చెబుతున్నారు.. కానీ రోజురోజుకూ కుక్కల సంతతి పెరుగుతుండడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.



### 18 నెలల పాపపై వీధి కుక్కల దాడి

శామీర్‌పేట, మార్చి 17 : వీధి కుక్కల దాడిలో 18 నెలల పాప తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కరుణాకర్ కూతురు రుష్మిత ఆడుకుంటుండగా వీధి కుక్కలు చుట్టుముట్టి దాడి చేశాయి.

గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు కుక్కలను చెదరగొట్టి పాపను తొలుత నీలోఫర్ ఆస్పత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.




# ఘనంగా మల్లన్న కల్యాణం

- తిమ్మారెడ్డిగూడలో కనుల పండువగా బోనాల ఉత్సవాలు
- ఊరేగింపుగా బోనాలు, ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు
- స్వామివారికి నైవేద్యం సమర్పించి, మొక్కుల చెల్లింపు

షాబాద్, మార్చి 17: షాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో మల్లన్న ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం ఉదయం గ్రామంలోని మల్లన్న దేవాలయం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మల్లన్న, గొల్లకేతమ్మ కల్యాణం నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లి స్వామివారికి నైవేద్యం సర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలతో పల్లెంతా మార్మోగింది. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల, ఎంపీటీసీ గుత్తి సునీత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ ఎంపీటీసీ పాండు, రామస్వామి పాల్గొన్నారు.



షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడలో ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

# జాలీగా.. శారీ రన్

టైటాన్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ తనైరా ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఆదివారం నిర్వహించిన శారీ రన్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. అంతకుముందు ఈ రన్‌ను ముఖ్య అతిథులుగా హెరిటేజ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి, యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ శారద, సినీ నటీ సంధ్యా జనక్‌తో కలిసి ప్రారంభించారు. మహిళలు ఇంటి బాధ్యతలే కాకుండా తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, యోగా, మెడిటేషన్‌తో పాటు సమతుల్యంగా పోషకాహారాలు తీసుకోవాలని వారు సూచించారు. మహిళలు ధరించే చీరలకు 5వేల సంవత్సరాల చరిత్ర ఉందని నారా బ్రాహ్మణి అన్నారు.

–ఖైరతాబాద్, మార్చి 17

